కృతజ్ఞత.

సీ॥ భవ్యభోగంబుల భాసిల్లుటం జేసి
సుమనఃపురసమమ్ము సాలసపురము
పరిసరవాహినీ పరివృతంబగుటచే
సుమనఃపురసమమ్ము సాలసపురము
యున్నతసౌధాళి యొప్పారుటం జేసి
సుమనఃపురసమమ్ము సాలసపురము
సురసాలతరువాటి శోభిల్లుటం జేసి
సుమనఃపురసమమ్ము సాలసపురము
గీ॥ సంతతము సుధర్మోచితస్థానమగుటఁ
జూడ సుమనఃపురసమమ్ము సాలసపురము
కనకరత్నాలయంబయి గ్రాలుకతనఁ
జూడ సుమనఃపురసమమ్ము సాలసపురము.

సీసమాలిక.

శ్రీమంతమై యశశ్శ్రీరంజితంబగు
సలలితవైశ్య మండలమునందు
గుజ్జముపేరటం గొమరారు సాంప్రదా
యము జగద్ధేయమై యవతరించెఁ
దద్వంశజాలలోన దానరాధేయుండు
సదమలకీర్తి బుచ్చయ్యసెట్టి
యాతనికులసతి కానందదాయియై
నందనుం డుదయించె నాగసెట్టి

వానియనుఁగురాణి పావనచారిత్ర
విమలగుణకదంబ వేంకమాంబ
తద్గర్భశుక్తిముక్తామయరత్నమై
హనుమానుఁడను శ్రేష్ఠి యవతరించె
నతనియిల్లాలు మహాలక్ష్మి కాంచెను
దనయుల నిద్వర ధన్యతముల
నందగ్రజుండు నాగయసెట్టి యొప్పువీ
రయ్య యగ్గుణనిధి కవరజుండు
హరిగుణాఢ్య మహాలక్ష్మిఁ బెండ్లాడి
దత్తపుత్రుని గుణోత్తము గ్రహించె
గుణరత్నవారాశి కోటివీరయ తన
యన్నపుత్రుండు తోడై నటింప

గీ॥ ఉభయవిత్తసహాయ్యంబులొప్పమీర
సూక్తిరత్నావళిని సుప్రసక్తి వెలయు
నట్లు ముద్రింపఁజేసి రాయామినీంద్ర
తారకంబుగ జగతిపైఁ దనరునట్లు.

సీ॥ ఎవరిసంపల్లక్ష్మి హిందూమహాజన
విద్యాభివృద్ధికై విఱ్ఱవీఁగె
నెవరిదాతృత్వంబు ప్రవిమలద్విజకోటి
సంతుష్టికై యున్నసతిమయ్యె
నెవరియశోలతానవనవాంకురముల్
దివిజగంగ మునింగి దెసలఁబ్రాఁకె

నెవరిసద్గుణపుంజ మవిరళతరతార
కావళికంటె నత్యధికమయ్యె
గీ॥ ఎవరు తమమానసముల ననవరతంబు
దివిరి నాదెళ్ళ రామయ దేశికేంద్ర
పాదసేవాభిరక్తికై బరపుచుండు
రట్టి వీరయ కోటివీరయలు ఘనులు.

సీ॥ పెట్టించి రెవ్వారు పృథులాన్నసత్రంబు
పాటిమీరిన రుద్రపాటియందు
యిచ్చి రెవ్వార లహీనమాన్యక్షేత్ర
ములను సత్రమునకై సాలసయందు
ధనమిచ్చి రెవరు విద్యావృద్ధిగావింపఁ
బోలుపుమీరు ఫిరంగిపురమునందుఁ
జేసి రెవ్వారు గురుసేవలు శేముషీ
పాటవంబున గొట్టిపాటియందు
గీ॥ వారు వైశ్యకులీనులై వరలువారు
గుప్తమనుపేర నొప్పారుకులమువారు
ఉచితవృత్తి సదావర్తి నొసఁగువారు
పేర్మిఁగలవారు వీరయపేళ్ళవారు.

గీ॥ భాసురంబగు సాలస వేంచేసియున్న
మంగళాదేవి నెనయుఁ శ్రీరంగధాముఁ
డాయురారోగ్యపుత్ర పౌత్రాభివృద్ధి
గుప్తముకులంబునకు నొడఁగూర్చుఁ గాత.

కం॥ సంతోషవహుని పంతత
శాంతరసోద్భాసితాత్మ సమరసకరుణా
స్వాంతుఁ గౌణపత్రి లక్ష్మీ
కాంతుని నాహితుని బ్రోచు గౌరీసుందర్.

ఆస్మద్గురుచరణాభ్యాంనమోనమః

శ్రీ సూక్తిరత్నావళి.

భక్తపారితోషికము.

ఉ॥ శ్రీజగదాత్మ భానిజనచింతితపావననామ నీలతు
గ్వ్యాజితదేహ రాఘవుని రాజ్యధురంధరుఁ జేయుచో మహా
రాజులు తాపసుల్ కవులు రంజిల సీతగళంబువందిడ
స్వీజితశేష ధాత్రిపతిద్యుతిహారము నీవె మారుతీ! ౧

కృతజ్ఞదాంపత్యము.

చ॥ సతతము భీష్మపుత్త్రి విడఁజాలఁడు మన్మథమోహితాత్ముఁ
గతియుఁగ నేమినాకనుచుఁ గాంతుపయింబగఁబూని లోనస ద్వై
మ్మతినివహించుసత్యఁగనిమాఱువిరోధముమాన్పి మాయచేఁ
జతురవచస్కుఁడై ముదము సల్పెడు కృష్ణు భజింతు నెప్పుడున్

స్వయంవరము.

ఉ॥ ఏసతి శౌరిచేతఁ దనయీప్సితము ల్వడయంగ, వార్తలన్
భూసురవర్యుచే ననిపి ప్రాజ్ఞుల గారినిదన్ని ద్వారకా

వాసునిచే గ్రహింపఁబడి భావవిశుద్ధతఁ బ్రీతిఁ జెందెనో
యాసతి రుక్మిణి న్మది నహర్నిశమున్భజియింతు రాధికన్

స్వాధీన పతిత్వము.

చ॥ శిరమున గంగఁ దాల్చుఁ దనచెంతవసించిన సగ్నసంభు;సుం
దరియని దానిమెచ్చు వనుదక్షతనూభవఁ గిన్కమాన్పన
త్తరి మృదువాక్యశైలిని మదర్ధశరీరము నీకొసంగితి
న్మరువకుమత్కృతజ్ఞతను మాననినీ వనుశంభుఁగొల్చెదన్

గుణత్రయవిభాగము.

చ॥ మొదలనుమూర్తులన్ ముగురముచ్చటగాను సృజించివారికీ
యదనున సృష్టిసంస్థితిలయంబు లనందగుకృత్యముల్ముదం
బెదఁగొన నిచ్చి వాఘ్మరిసతీశసతీమణిరూప మూనుచుం
బాదుపుగ భక్తపుంజమును బ్రోచు మహేశ్వరినాశ్రయిం
(చెదన్

భార్యాపరవశత్వము.

ఉ॥ వ్యాసవసిష్ఠకౌండసనకాత్రిశుకాదులు పల్కు స్తోత్రవి
న్యాసములందుఁ దద్దయు మనంబునుగూర్చినవాఁడుగాన భా
షాసుదతీసుగీతమున పాత్రముచేయుచు నూత్నసృష్టిఁ జే
తాసను బొంది మించుకమలాసను వాసిని సంస్మరించెదన్

స్త్రీవినోదము.

ఉ॥ పాణిని వీణఁబూని సితపద్మమునంగొలువుండి పద్మజు
న్జ్ఞాణతనంబుమీర మదిసంతసమందఁగఁజేసి పాటచే
శోణదృగంచలంబులను శోభిల లోకము తేలునట్టి యా
వాణిని మానసంబునను వారకగొల్చెదఁ దద్దయాప్తిశై

స్తోత్రము.

చ॥ సుజనులఁబ్రోచు ప్రోడను విశుద్ధసమస్తకళానివాసు నీ
రజభవముఖ్యదేవగణరంజితపాదు గిరీంద్రపుత్రికా
నిజవదనాబ్జభాను స్తవనీయవిచిత్రఫణీంద్రభూషణుం
గజవదనుఁ భజించెద సుఖమ్ముగమత్కృతి సాగసమ్మలర్

ప్రాచీనకవిస్తుతి.

ఉ॥ ఆనత సర్వలోకుఁడగు నాదికవీంద్రుని నాకుజాతునిన్
మానికులాబ్ధిసోము సురమాన్యుని వ్యాసునిఁ గాళిదాసుఁ బ్ర
జ్ఞానిధి నన్నపార్యుఁ గవినాయకుఁ దిక్కన నెఱ్ఱప్రెగ్గడ
న్మానక కొల్తుఁ; బేర్కొనుట మానెద దుష్కవికోటి నెంతయున్

గురుస్తుతి

ఉ॥ ఆటలపాటల న్గరపు నజ్ఞులతోఁ జెరలాడనీక ము
మ్మాటికిఁ దమ్ముఁడన్నయభిమానముఁ దోడ్పడఁ గావ్యపాఠము
ల్పాటనమొప్పఁ జెప్పి ననుఁ బాలనఁ జేసి యశంబు దిక్కులన్
సాటినవేంకటప్పయ విచక్షుణు మద్గురు నాత్మ నెంచెదన్.

అదృష్టము.

ఉ॥ పండితుఁడొక్కరుండు పసిబాలురఁ జేరిచి విద్య నేర్పనం
గొండొక కాలమందుఁ గనఁ గొందరె విద్యకుఁ బాత్రులౌదుర
చ్చండమహాలాళిదున్ని వెదఁజల్లిన బీజము లంకురించి ప్రో
ద్దండతవృష్టిసోక ఫలితమ్మగునే యవియెల్ల నెల్లచోన్ ౧౧

గాంభీర్యము.

చ॥ కనుఁగొన సాధుమానసము కష్టపరంపర లొక్కపెట్టున
న్బనివడిదూకసాగిన విపాకముఁ జెంది చలింపనేర్చునా?

గనలి విపత్పరంపరలు గాంధిమహాత్ముఁడు విచ్చలింపఁగన్
జెనఁగొని పైఁగొన న్మనసు పేదరికంబు వహింపఁబోవునే.

పరకార్యసాధనము.

ఉ॥ ఏడులుపూఁడులంచు మదినెన్నరు పూనినధర్మకార్యమం
దోడరు దుర్భరంబని కృతోద్ధతులైనమహాత్ము లివ్విధం
బేడ నదెట్లన న్విషధరేశుఁడు వేయిశిరంబులందుఁదాఁ
గూడును నిద్రమానికొని కుంభిని దాల్పఁడె సర్వకాలముల్

ఉ॥ లోకములోన మిత్రునకు లోలత మేలిమిఁగోరి ప్రాజ్ఞుఁడా
ప్రాకటకార్యసాధకతఁ బ్రాప్తభరుండయి కష్టమొందు సు
శ్రీకరమైన హాటక మచేతనమైనను స్వర్ణకారుచేఁ
గాకకు లోగి ఖండములుగాదె యలంకృతిగాఁగ నొడ్లకై.

విధికృతము.

చ॥ అధికధనాఢ్యుఁడంచు తనయాప్తునినెంతయునమ్మిహృద్యమా
విధమున రాత్రియుంబవలు వీడకకొల్చిన భాగ్యమబ్బునే?
విధిగతిఁ గల్గునద్దియు; గుబేరునిజేరి గిరిన్వసించుమ
న్మథమథనుండుభైక్షమును మానఁగడంగునెలబ్ధయత్నుఁడై

దురదృష్టము.

ఉ॥ పుట్టినవంశమారయ సుపూజితమైనను మానవుండు తా
నెట్టితపంబుఁజేసిన నరేశ్వరుఁడైన మహావిపత్తులం
బట్టునఁద్రోయ తేఁడిలను బాండుతనూజులు రాజ్యసంపద
లట్టడిఁ బాసి దుర్గములఁగష్టములొందరె ద్వాపరంబునన్.

లోభ్యవృత్తి.

చ॥ వసుమతి లోభిమిక్కుట మవారితశక్తి ధనంబుఁ గూర్చిపెం
బొసఁగఁ దదర్థ మన్యులకు భోగ్యముగావుటఁ జూడ మేరహీ
నసలుచుఁ దేనెటీఁగలు సమంజసవృత్తి గణించు తేనియ
ల్వొసఁగని సర్వమానవులు వేడ్క భుజించుట లబ్ధమే ధరన్ ?

లుబ్ధవిత్తము.

ఉ॥ రొక్కముఁ బెల్లుఁ గూర్చిన నరుండు జగంబున లోభమూర్తియై
యొక్కపుడైన నిచ్చుటకు నోపమిఁ దద్ధనలక్ష్మి నింద్యమా
చక్కని పూవుఁబోఁడి ఘనచారువయస్క భ్రమించి పుంస్త్వముం
దక్కిన యొక్కషండునకు దక్కి వినిందిత కాదె యుర్వరన్.

జంతునైసర్గికము.

చ॥ కుజనుఁడు సజ్జనంబులను గూడి నిరంతరముఁ జ్జరించిన
న్నిజమగు దుష్కృతిన్విడువ నేరఁడొకప్పుడునైన భూమిన
క్కజమగు ప్రేమచేతఁ జిరకాలముఁ బాలను బోసి పెంచిన
న్నుజనుని సర్పడింభకము స్రుక్కఁగఁ బీకదె పంటమిత్తియై

ఉ॥ మంచితనంబుచేఁ గుజనుమానస మెంతయు సత్పథంబుఁ బ్రా
పించు విధంబుఁ జేయఁగను భేదముఁ జెంది వెసం దొలంగెడున్
ఇంచుక వంకమానునొకొ యిజ్జగతి శ్వానకంబు తోఁక బం
ధించినఁగాని దండమునఁ దీరనియత్నముఁ జేసినం దుదిన్.

దాతృత్వము

ఉ॥ దానగుణాభివర్ధనుఁడు దైన్యమున న్నొనియాడు నర్థులం
బూని తదీప్సితార్థమును బొందఁగఁ జేసి సుఖంపఁ జేసెడున్

మానుగఁ బ్రావృషంబుననుమానక మేఘుఁడుచాతకాళికిం
దీనతమాన్ప నీరమిడి ధీరుఁడన న్యశమొందకుండునే ?

సహజదాతృత్వము.

చ॥ అరయఁ దురాత్మకుండు తనకంతకుఁడై నికటంబుఁ జేరినన్
ధరనుబరోపకారపరత న్ఘనుఁడు వానికి మేలెచేసెడున్
నరుఁడుగుఠారమొత్తి కుహనామతి మ్రొక్కఁ గొట్టుచున్నఁ డాయరాఁ
దరువర మాత్మశాఖలను దట్టపునీడ నీదె వానికిన్

పరోపకారము.

ఉ॥ కొందర నాశ్రయించికొని కోపనుఁడొక్కరుఁ డాదరంబునం
గొందలమందియైననొకఁ గూర్చునుగాదెమహోపకారముం
బొందుగ వారివాహుఁడు సముద్రము వేఁడి జలంబు దెచ్చియా
నందముఁగూర్పఁడే మిగుల నానాప్రాణులకిచ్చి ధారుణిన్

విద్యాప్రాధాన్యము.

చ॥ చదువరి కానిమానవుని సజ్జనసన్నుతశాస్త్రపద్ధకో
విదుఁగన రూపమొక్కటియు నెంత సభ న్గనుపించు భేదము
న్బదఁపడి కాకి కోవెలయుఁ బాఁడజనాళికి పన్నెతుల్యమై
విదితవసంతకాలమున వేరగు నెల్గున జాతిభేదముల్

ఉ॥ ఆరయగొప్పవంశమున నభ్యుదయంబునుగాంచిన న్నరుల్
భూరివిలాససంపద లమోఘముగాఁగ వహించినం గళా
శూరులు కాకయున్న సభ శోభిల నేరరు కింశుకంబు శృం
గారముఁగల్గియుండిన సుగంధవిహీనత మెప్పుఁ జెందునే ?

సర్వసమత్వము.

ఉ॥ ఎప్పుడు ధార్మికుండు ప్రియమేర్పడ దానముయాచకాళికిం
దప్పక చేయుచుండిన బుధాబుధసంతతికబ్బుచుండెడిన్
దెప్పలుగ న్వలాహకుడు తీవ్రత వర్షపుధారలుంపఁగా
మెప్పగునేల నూషరపు మేదినిఁ జేరవె నిర్ఝరాత్తలై.

ఉ॥ భూరికృపారసంబుఁ బరిపూర్ణముగాఁ బ్రసరింపఁజేసి స
త్పూరుషుఁడార్యదుష్టజనపుంజములందు సమత్వబుద్ధియా
సారకళాప్రవాహమునఁ జందురుఁడు సర్వజనాలయంబుల
న్వారకముంచు నెక్కుగతి వర్గములై పరిజలుల్లసిల్లఁగన్

గురుశిక్ష.

ఉ॥ ఒక్కఁడు లోకమందు సమయోచితమైన యుపాయశక్తిచేఁ
జక్కనొనర్పవచ్చు విరసత్వముఁ జెందిన లాతివారలం
బెక్కువచింపనేల పశుబృందముఁ గాచెడువేళ మానవుం
డెక్కుడుదండముం గొనియ తేఁచ్చువిధింపఁడె యాలమందలన్

వంశహాని

చ॥ తలకొని దుర్జనుండొకఁడు ధర్మపథంబునువీడి యాప్తులం
గలిసి సదాత్మసంతతికిఁ గష్టముఁ గూర్చిన వాఁడు భూమిపై
నిలుచునె మున్ను యోధనుఁడు నిక్కముధర్మజుగాసి వెట్టితాఁ
బొలియఁడె తమ్ములం గలిసి భూరిపరాభవమొంది దుష్టుఁడై

బంధుప్రీతి.

చ॥ కడుతడవైనకాలమునఁ గన్పడినంతనె బంధువుండు తాఁ
దొడిఁబడి యెల్లవారలకుఁ దోడనె ప్రాణము లేచివచ్చెదున్
బొడమి నభోవిటంకమునఁ బ్రొద్దటుఁ జేరినయంతమాత్ర రే
ముడిగినతమ్మి కొమ్మరఁ బ్రమోదముఁ జెందదె సుప్రసిద్ధమై

జాతినైపుణ్యము.

ఉ॥ మాటలతారతమ్యము సమర్థుఁ డెఱుంగు రసజ్ఞుఁ డోటనా
రాటముఁ జెందుటొక్కఁడె ధరన్విరసజ్ఞుఁ డెఱుంగ నేర్చునా
హాటకపాత్రమం దిడుపయస్సలిలంబుల హంసనేర్పుమై
నోటమిలేక పాల్గ్రుడుచు; నోపునె వాయసమెన్ని భంగులన్.

జ్ఞానప్రాధాన్యము

ఉ॥ జ్ఞానములేక మానవుఁడు శాస్త్రములెన్నిటిఁ జర్చ చేసిన
న్దానుబుధోత్తముండను ప్రధానయశస్సును గాంచలేఁడుగా
పూనియదెట్లన న్మలినముం బరిపూర్తిగఁ గొన్న గ్లాసున
న్మానితదీపముంచ రుచిమత్త్వము సేకురునెట్లు దానికిన్.

అపాత్రదానము.

చ॥ బుధనుత మంత్రరాజమును బూరుషుఁ డొక్కఁడు చంచలాత్ముఁ
యధమునకిచ్చినంత నది హైన్యము నొందుమఱింత యెట్లన ద్రా
న్వాధిపరిపాకముంగనిన వీక్షణహీనునిచేత దర్పణం
బధివసియింపఁగా నమలమయ్యు నిరర్థకమౌటతథ్యమౌ.

సత్పాత్రదానము.

ఉ॥ యాచకులాశ్రయింప వినయమ్మున వారికళావిశేష మా
లోచనఁజేసి పాత్రుఁడని లోలత దానము సేయుటెన్నయా
కాచినగోఘృతం బనలకంపితపావకకుండమందు సం
కోచములేక వ్రేల్చిన నకుంఠితసార్థక మొందకుండునే. ౩౮

సత్యవ్రతము.

చ॥ ఇడుములఁ జెంది పుణ్యజనుఁ డెంతకృశించినఁ బల్కుసత్యముం
దడపడ మారుఁబల్కుటకుఁ దప్పుకుత్రోవలఁ ద్రొక్కఁడెట్లన
న్నృపుఁడమిఁ త్రిశంకునందనుఁడు భోగముఁగోల్పడి హీనవృత్తిచే
బడలి సమస్తకష్టములపాలయి సత్యము వీఁటిబుచ్చనే. ౩౯

పితృవాక్యపరిపాలనము.

ఉ॥ పెద్దలువల్కువాక్యములను వేదమటంచు యథోచితంబుగా
నిద్దపుభక్తిఁబూని మదినిశ్చలతంజరియింప ధన్యుఁడౌ
యద్దియునెట్లన న్దశరథాజ్ఞ శిరంబునఁదాల్చి రాముఁ డ
త్యుద్ధతిఁగీర్తిఁగాంచె సమయోచితశక్తివహించి కానలన్.

మాధ్యము.

చ॥ తనమదిఁదోఁచకుండిన బుధప్రకరంబు సమీపమొంది నీ
తినిబలుమగ్గడించి నియతింగనుఁదెల్పినఁ బూనకుండిన
న్వనటను జెందు మానవుఁ డవారితశక్తి విభీషణుండు రా
వణునకు నీతిఁదెల్ప నదివ్యర్థమొనర్చి చెడండె దుష్టుఁడై.

కేవల మాధ్యము.

చ॥ కుజనులఁగూడి జీవితముఁగుత్సితకార్యములందుఁజొన్పి తా
స్వజనులనేచుదుష్టమతి సర్వవిధంబులఁ జేటుకై మనో
రుజఁగొనినీల్గు నెట్లనఁబరుండని పుత్రునిజంపఁబోఁజతు
ర్భుజువలనన్ హిరణ్యకశిపుండు నశించె విచారశూన్యుఁడై

కేవల మాధ్యము.

ఉ॥ ఈధరమూర్ఖుఁజేరి చెవికింపగుపుష్కలనీతిమార్గము
న్బోధనొనర్ప బోధితసుబోధము వానికి దుష్టబోధమౌ
బాధనొనర్ప కేనరుఁడు పాలనుబోసిభరింప భోగికి
న్వేధఘటించు దుష్టవిషవృద్ధిక్రమంబునఁగల్గు న్బ్రమై.

మహాసాహసము.

చ॥ సిరిఁదులఁదూగి నిందితపుచేతలఁదక్క నిరంతరంబుఁదాఁ
బరులకు దానమిచ్చి తుదిభాగ్యవిహీనతఁజెంది కీర్తిసం
భరితుఁడుకాఁడె మానవుఁడు మానుగ దైవముకంటగించిన
న్నిరుపమపుణ్యశాలి బలినెక్కొనలేదె మహాపథంబునన్.

దుష్టసాంగత్యము.

ఉ॥ ఒక్కనిచేవపూనికిఁ దమకోటమిఁగల్గదటంచునమ్మి పెం
పెక్కినపేర్మిఁగాచుకొని యెంత చరించినఁ గీడుమూడదే
అక్కురురాజపుత్రశత మర్కకుమారునినమ్మి యుద్ధమం
దక్కట లచ్చికిందొలఁగియాపదఁజెందిరి క్రోధమూర్తులై

మహదాశ్రయము

చ॥ నిరతము నల్పమానవుఁడు నీతిసిగోరి మహాత్ముఁజేరి యా
దరమునుగాంచితత్కృపణఁ దద్దయుఁజెందు మహోన్నతత్వము
న్సురుచిరపుష్పసంకలితశోభనసూత్రతనైకతంతుపు
న్నరుఁడు ధరింపఁగా గళమునన్ రహించదె పుష్పసంతతిన్

స్వజనవాత్సల్యము

చ॥బలయుతుఁడైనవాఁడుతమపక్షమువారలఁధూర్తుఁడొక్కరుం
డలజడిపాలుచేయఁగ రయంబున నాపదఁబాపి సుస్థితి
న్నిలుపును గోపగోకులముఁ జక్కముగావఁడె యద్రి వేలిపై
నిలిపి మురారి దేవవిభునిర్మితవృష్టి భరించి బృందలోన్

దుస్స్వభావము.

చ॥ పరహితకార్యతత్పరతఁ బాటువడంగను జొచ్చుమానవుం
డరయఁ బరాంగనారతి సహర్నిశము న్జరియించుచున్న నా
తురతఁజెడు న్నిశాకరుఁడు దుర్గముఁడై భువనోపకారియై
గురుసతిఁగూడ క్షీణదశ గుందఁడె చేడ్పడికాలతంత్రుఁడై

దుస్స్వభావగోపనము.

చ॥ మదిఁబరితాపమున్నొనక మాయికకృత్యములన్వహించితాఁ
బదుగురుఁగాంచఁ బెద్దవలెఁబైపయిఁదోచుచునుండుదుర్జనుం
డుదధిఁ దిమింగిలాదికమహోగ్రపయశ్చరయుక్తినొప్పి తా
సదమలనీరమట్లు జనసంతతికిం గనుపించదే భువిన్.

అపూర్వసౌభాగ్యము.

ఉ॥ పుట్టినదాది మానవుఁడు పుణ్యగుణంబుల కెల్ల నిక్కమై
చెట్టగుణంబు లొకండు తనుఁ జెందిన హీనతఁ జెందునే ధరన్
నెట్టన భోగ్యజాతము లనేకముగల్గి హిమా ప్తిఁబొందిన
న్బట్టునఁ బర్వతాధిపతి భావముఁగాంచదె శీతశైలమున్

సౌజన్యము

చ॥ విమలులఁ జేయు నెల్లరను విష్ణుకథావళి శైవగాథలన్
సమరస మొప్పఁ జెప్పి నిజకీర్తి గొలందిని బుణ్యదాతయై
విమలమనస్కుఁ డెట్లనిన విష్ణుపదోద్భవ గంగ లోకము
ల్విమలజలమ్ముఁ దాలిచి పవిత్రతనీయదె పాపహంత్రియై

చ॥ సుజనుఁడు జన్మమెత్తి గుణశోభితుఁడై జగతీహితార్థమై
నిజచరితంబు సత్యమున నిల్పి పరోపకృతిన్ ఘటించుఁడా
నిజకిరణప్రసారమున నిచ్చలు లోకము మెచ్చఁ బద్మినీ
వ్రజమున కిష్టదాతయయి భాసిలఁడే రవితిగ్మధాముఁడై

లోకజ్ఞత

చ॥ అనయము మానహీనున కనాదరణమ్ము ఘటింతురి మానిక
స్ఘనుఁడని కేలుమోడ్తురు జగజ్జనము లొప్పఁ గాంచినంత; నె
ట్లనమనుజుండు బూడిదెరయంబునఁ ద్రొక్కుట కుత్సహించు మం
డినయనలంబుఁ ద్రొక్కుటకు డెందమువందున నిచ్చగించునే ?

ప్రాముఖ్యము.

చ॥ చెడుగులు లేకిబిడ్డలు విశేషముగా జనియింపనేల ? పు
త్రుఁడు గుణవంతుఁ డొక్కరుఁడు రూఢిగఁ జాలఁడె వంశరత్నమై
పుడమి నదెట్లనంగ నుడుపుంజ మసంఖ్యగ నంబరంబున
న్వడలుట కేమి పున్నమను వెన్నెలరేఁ డొకఁడున్నఁ జాలడే

అవిచ్ఛిన్న విశ్వాసము.

ఉ॥ ఎవ్వనియందునమ్మకము హెచ్చుగుచుండునొ వానియందె కా
కెవ్విధి నాశఁబూనిన నదెట్లును నిల్వఁగఁబోదు చూడఁగా
నివ్వసుధ న్మనుష్యునకు నెట్టనఁబారునది న్నరుండు తాఁ
గ్రొవ్వి నిరోధమేర్పరుపఁగోరినమాత్రనె యద్దియాగునే?

ఉ॥ చేరువఁదీసి కష్టదశఁజిక్కులనెల్లను బాపి రక్షణా
బారయుఁజేయఁబ్రీతుఁడయి యాతని నమ్మిచరించుమానవుం
డీరసమొందనేరఁ డదియెట్లన నిచ్చలుఁగూడుఁబెట్టి సాం
పారఁగఁబెంప శ్వానము సదాశ నరు న్విడనాడనోపునే?

ఆత్మశుద్ధి.

చ॥ చెడుగులతో నొకండు కొను చెల్మిని దుర్గుణమబ్బదంచుఁ ద
ద్దుఁడు పలుమారుఁబల్కుఁ బరిశోధనఁజేయఁగనద్ది సత్యమా
జ్ఞ
విడువక నీటిప్రబ్బలి భువిందటసంస్థితమై ప్రవాహము
న్విడలఁగఁదోడుతో న్మునిఁగి వెండిసుఖస్థితిఁగాంచుఁదొంటిమై

దార్ఢ్యము.

చ॥ ఒడిగి పరాజ్ఞకు న్వెరచి యూరటఁ జెందనిదీనమర్త్యులం
గదిమి భయంబుఁజెప్పుదురు కాదనువారలజోలిఁబోవ రే
యదనునఁగొంద రిజ్జగతినారయ వ్యాఘ్రము లేడిపిల్లపైఁ
గదియునుగాని గోటఁజెనకంగలదే మృగరాజు నెత్తరిన్.

స్వధర్మపాలన.

చ॥ కుశలముఁగోరి కోరికలఁగొల్లగఁగూర్చి ప్రజానురక్తిమై
వశమతిఁబూని మానవులఁబాలనఁజేసిన నంతరాజు స
ద్యశముఁగాంచు నెట్లనినధర్మతనూభవుఁ డేలిరాజ్యముం
దశదిశల న్స్వధర్మపరత న్వెలయించె యశమ్ము శమ్ముగన్.

ఆర్తరక్షణము.

ఉ॥ ఎన్నన నశ్వరంపు సుఖమేర్పడ నార్తతతి న్భరింపఁదా
సన్నుతుఁడై ప్రసిద్ధిఁ గొనఁజాలును నిత్యము మానవాళిచేఁ
గ్రన్నన మానవుండహా; వినుకర్ణుఁడు ధార్మికతన్వహించి యా
పన్నజనాభిరక్షకతఁ బాయకొనండె యశోబ్ధినిత్యముల్.

చ॥ పరులకుఁ గీడు మూఁడునెడఁ బ్రాణము వీడుటకైన నోర్చి బం
ధురకృపఁ జూపి మానవుఁడు తోడ్పడియొక్కుఁడు మేలొనర్చు; శం
కరుఁడు విపత్పరంపరలఁ గాంచి సురల్తననాశ్రయింపఁగా
గరళము మెక్కి యార్తులను గానఁడె వింతగ మృత్యుజేతయై

దీనాశ్రయము.

చ॥ ధనయుతుఁడైనవానిఁ దప్పక బంధుగులాశ్రయింతు; రా
ధనము లయింపఁ దారపుడె దవ్వుల కేగుదు రాతురంబున
న్బనిఁగొని సంతతమ్ము ఫలపాదపపుష్పరసంబుఁ గ్రోలఁ దాఁ
జను నలి యద్దిలేనితరి సాగునొకో తిలకింపవృత్తముల్.

అనాత్మజ్ఞత.

చ॥ ధరఁ బరకార్యసాధనము ధైర్యముచేత వహింపఁబూనిన
న్నరుఁడు కిరంబుదై నగతి నాశనమొందుట సత్యమొందుమే
లరసి పరోపకారము సహాయములేక గణింపఁబూన శం
కరునయనాగ్నికీలలను గాముఁడు భస్మమగ్గఁడె రూపుమాయఁగన్.

చ॥ మొనగలవానిపై తనదుమూర్ఖతఁ జూపి దురంతకృత్యము
ల్బనిఁగొని సేయువాఁ డప్పుడు భంగపడున్ భుజశక్తిహీనుఁడై
చెనఁటియొకండు చేవగలచింతను గొడ్డలిచేత మోదిన
న్దనభుజసారమంతయును దద్దయు వ్యర్థమునొంద స్రుక్కుఁడే.

గుణప్రాశస్త్యము

చ॥ అరయఁగ మానవుం డొగి దురాత్మకుఁడైనను నిండుశ్రద్ధ నే
మరక గణించినట్టి కళ మాన్యత నెక్కుడు గాంచి భూషితా
భరణమటంచుఁ బేర్వడదె ప్రాణిభయంకరదీర్ఘపృష్ఠరా
ట్ఛిరమునఁ దేజరిల్లు మణి చేకొను నే యెపుడైన హైన్యముల్

డాంబికము

ఉ॥ శాత్రవుఁ డొక్కరుండు తన సన్నిధి లేమిఁ బ్రగల్భశక్తివా
జ్మాత్రముఁ జూపు వైరిఁ గని మాన్యవిహీనత డాగు మర్త్యుఁడీ
ధాత్రిని రాత్రికాలమున దర్పముఁ జూపి తమఃకదంబము
ల్మిత్రుఁడు రా బిలాంతరవిలీనవిచేష్టకుఁ జొచ్చునల్లనన్

ఉ॥ పట్టును బట్టి యాచకులు పల్దురు వేఁడిన బూటకమ్ముల
న్బెట్టుగఁ బల్కి ద్రవ్యమును వీడక డాంబికుఁ డాపఁ జూచు నె
ప్పట్టుల శారదాభ్రము నభస్థలిఁ గర్కశగర్జితాత్తమై
కట్టడి వర్షశూన్యతను గాంచదె లోకమెఱుంగ వెల్లనై॥

సారగ్రాహిత్వము

చ॥ సుకవు లుదాహరించు రసశోభిత కావ్యములందు వర్ణన
ల్ప్రకటిత వాగ్మియై బుధుఁడు భావమునందు గ్రహించు; మందుఁ
వికలమనస్కుఁ డెంచునె వివేకిచకోరము పూర్ణచంద్రచం ద్రొ
ద్రికల హరించు; నేర్చునె హంస మరొక్కపులుంగు జాణయై

ప్రియవస్త్వప్రాప్తి

చ॥ హితవు వహించి మార్దవము నెంతయుఁ గాంచి వచించు మానవ
వుం డతులిత శాస్త్రసంభరితుఁడై లభియించుట దుర్లభంబిల
న్నుతతముఁ జూడ నుర్వ్యనఘ స్వాదువుఁ జూపి మతిమంతరోగికి
న్హితవుగ వ్యాధిమాన్పు లభియించునె యౌషధమెందుఁ జూచినన్

పరేంగితము

చ॥ కడకవహించి పండితుని కష్టముఁబండితుఁడే యెఱుంగు న
జ్ఞుఁడుతగఁదత్పరిశ్రమము నంతయు నెప్పుడుఁగాంచలేఁడుగా
పుడమి నదెట్లనంగ విను పుత్త్రు నెఱుంగని వంధ్య నేర్చునే
కడిమి వధూప్రసూతిభవకష్టపరంపర లొక్కనాఁటికిన్

ఆత్మరక్షణోపాయము

ఉ॥ శాత్రవబాలు బాలుఁడని క్షత్త్రియుఁడా త్తఁదలంచివీడ నా
శత్రుకుమారుఁడే పరమశత్రువుఁడై తనపాలిమృత్యువౌ
గాత్రమునందు దుర్వ్రణము గల్గిన నిష్కృతిసల్పకుండిన
న్ధాత్రి శరీరధారులను దద్వ్రణ మేర్చుముగాదె వహ్నియై

మిత్రసహాయము

చ॥ పరబలభేదనందు నిరుపద్రవమైన సహాయమేర్పడన్
నిరుపమశక్తిఁగాంచి యవనీతలమందు జయించు సర్వము
న్గురుబలశాలి మారుతము క్రొంకకతోడ్పడఁ బావకుండు సం
భరితమహాశిఖుండునయి భస్మముఁజేయఁడె సర్వలోకముల్

ఉ॥ ఎక్కుడు వైరముల్గాని బలమేర్పడి శత్రువు లాక్రమించినం
జిక్కును జెందఁజాలఁడవని న్స్వజనవ్రజగోప్తుఁడౌటఁ బె
న్మక్కువఁ బార్థివుండు కడుమార్కొని పైకొనవృష్టికుండునే
యక్కట ఛత్రమొక్కటి సహాయముగల్గిన మానవుం డెడన్

ప్రారబ్ధము

చ॥ కడుబలవంతుఁడౌ నరుఁడు కాలవశంబున లాతివారిచే
సుడిఁబడ నిక్కటుల్గుడిచి శూరతఁగోల్పడి కర్మబంధము
న్గడువడఁ దెట్లనన్నలుఁ డఖండపరాక్రముఁ డయ్యుఁ జెందఁడే
యిడుములఁబార్థివుండుఁగలిచేఁబరాభవ మొందిననృపుఁడై

ప్రతిజ్ఞాచరణనిర్వాహణము

చ॥ మనసున సాహసంబాదవ మానధనుండు ప్రతిజ్ఞఁజేసిసా
ధనముననిర్వహించు బెడిదంబగు కష్టములొందిన్యాయమే
దిని సభ భీముఁడుద్ధవిడి తీవ్రమహాప్రతినంబురాజుపైఁ
బనిఁగొనిసల్పి దానిఁ దుదిఁబట్టఁగఁజేయఁడె మద్గుచెంగటన్

సుబోధము

ఉ॥ స్నేహితుఁడొక్కరుండు తనచెంతనుజేరి ప్రియంబువల్కినన్
సాహసవృత్తి నద్ది వినఁజాలనిమానవుఁడొందు నాపద
శ్నేష్మనాగతి న్సుబుద్ధి వినఁజెప్పిన రాజనరేంద్రనందనుం
దూహనొనర్పమింజెడఁడె యుత్కటసంకటమొంది బేలయై

బంధుద్వేషము

ఉ॥ నిందనొనర్చి బందుగుని నేరములంగలిపించి మీఁదటం
గ్రిందునుమీఁదుఁజేసిన నికృష్టుఁడు తత్ఫలమొందుఁదానె త
న్నందనుచేత నొక్కతరి నాఁడు మఱందిసి భూరివంచనం
జెందఁగఁజేసి కంసుఁడు నశింపఁడె యల్లునిచేత వధ్యుఁడై

సాహసాంకము

చ॥ పతికిజనించుకష్టదశ భండనభూమిని గాంచి విక్రమో
న్నతిఁజెలరేగి వైరులను నాశముఁజేసి మహాహవంబులో
మ్మృతిగొని ఖ్యాతిఁగాంచునరుఁడొందుసుయోధను సేనలాజిస
మ్మతిబలినిచ్చిచచ్చియభిమన్యుఁడుకాంచఁడె వీరభోగమున్

శరణాగతవాత్సల్యము

చ॥ శరణనుమాటవిన్న నవిచారతదొట్టిల నాదరించి స
త్వరమునఁగావఁబూను వసుధ న్శరణాగతవత్సలుండు కి
న్నరుఁడుగయుండుభీతిలుచునారదుఁడంపఁగఁ బాండవేయుని
న్శరణనివేడఁ గావఁడె విచారణఁదక్క కిరీటి మేటియై

అమానుషకృత్యము

ఉ॥ శుద్ధమనస్కుఁడొక్కరుఁడసూయవహింపకతంద్రుఁడై క్రియా
సిద్ధివహించి కార్యముఁ బ్రసిద్ధిగఁజేఁగొను సంతతమ్ము సి
ద్ధ్యృద్ధతిఁగుంభసంభవుఁడహో యనదేవత లబ్ధివారి స
త్పద్ధతి నొక్కమారుఁగొని పానముఁజేయఁడె పట్టిపోవఁగన్

పాపఫలము

ఉ॥ మోసముగాన లేక మదిమోహముఁగాంచి దురంతకృత్యము
ల్చేసినప్రాణి తత్ఫలముచెందు సహింపఁగరానిబాధల
న్వాసవు మంకుచేతలను వల్లభు నివ్వెడలించి నాఁడహ
ల్యాసతి కాంచదే దృఢశిలాకృతిఁ దత్ఫలమొక్కపెట్టుగన్

వస్తుప్రాశస్త్యము

ఉ॥ ఒక్కఁడుచాలు నీప్సితము నొవ్వక తీర్పఘనుండు మర్త్యుల
న్బెక్కురు రాశలంగొలిపి బిచ్చముఁబెట్టనిలోభులేల వే
ల్రొక్కముఁబోసి తెచ్చిన విరుద్ధపుగోగణమేల చాలదే
చిక్కని వేల్పుటావల వసిష్ఠునకు న్బరితుష్టిఁజేయఁగన్

గుణగ్రహణము

ఉ॥ శాంతినిధానులై దొరలు సంతసమాత్మవహించి సత్కళా
వంతుల నుత్తమాంగమున వన్నెగఁదాలిచి సత్కరింతు ర
త్యంత మదెట్లన న్హరుఁడు తద్దయు నన్యులవీడి సత్కళా
వంతుని శీర్షమందు నెడఁబాయకదాల్పఁడె దేవదేవుఁడై

ఇష్టానిష్టసూచనము

చ॥ విఫలములయ్యె మూర్ఖులకు వీఁకనుసజ్జనవాక్యసంతతుల్
సఫలతఁగూర్చుఁబ్రాజ్ఞులకు; సాదరయోషిదపాంగవీక్షణం
బఫలమొనర్చి బాలకుల, కంగజబాధితయూనకోటికి
న్సఫలతఁగూర్చునిజ్జగతి సాంద్రవిరాగసురాగదాయియై

అవివేకము.

చ॥ అతులితభావసంచయరసాత్మకకావ్యముఁ గాంచి యాత్మలో
సతతము నిందఁ జేయు మది జాడ్యము గూరిచి ఖేద మొందఁ బోఁ
డతనుజడత్వధారి సముదంచితకంచుక ముద్ధరించి వి
శ్రుతగతి నైకదూరదొకొ శుష్కపయోధరధారి చేలమై.

ఇతరకృతవస్తుప్రకాశము.

ఉ॥ ధర్మపరుండు లోకమునఁ దద్దయుఁ గీర్తి గణింపఁ బ్రాజ్ఞుఁ డా
నిర్మలకీర్తిఁ గావ్యముల నిక్కము వర్ణనఁ జేయ వర్ధిలుఁ
శర్మముఁ గాంచి నీరమునఁ జారుతరాబ్జము సూర్యరశ్మిచే
నిర్మలశోభఁ దాల్పదొకొ నిశ్చలసంపదకున్ నిధానమై.

బహులఘుతరసాధ్యము.

చ॥ పదుగురు దుర్జనుల్ కలిసి పాయని చెల్మిని జేయ వారితో
విదితబలుండు మర్త్యుఁడు భువిం గడు మార్కొని పోరఁ జాలఁ డ
య్యది యెటులన్న బాలతృణమల్లనఁ గూర్చిన త్రాటిచే మహా
మదగజమైనఁ గట్టువడి మానదె మానసమున్నతార్భటిన్ ॥

దైవబలము.

ఉ॥ పంతమునన్నరుం డొకఁడు పౌరుషమాత్మ వహించి కార్యము
న్నాంతముఁ జేయఁజాలఁ డనయమ్ముల దైవము సూడకుండిన
న్నంతయు సాగునే రథము చొక్కపుటశ్వయుగంబు గూర్చిన
న్వింతగఁ జక్ర మొక్కటి విభిన్నము నొంది తొలంగిపోవఁగన్.

నీచమహిమ.

ఉ॥ వాక్కుల మాధురీరస మవార్యగతిం గురుపించు పండితుం
డొక్కఁడు లేక యున్న సభ నున్నతుఁడౌను జడుం డదెట్లన
న్నెక్కొని పర్ణభాస్వదవనీరుహసంతతి లేనిచోట స
మ్యక్కళలేని యాముదపుమ్రాను ఘనంబు వహించు నెప్పుడున్

నిష్ఫలవ్యాపారము.

ఉ॥ కాసుగణింపనేరక వికాసముబుద్ధికిలేక మానవుం
డాసఫలింప యాచకసహాయముఁ జేయఁగ లేఁడు దుర్ధర
భాసురగ్రీష్మమందునఁ గబంధవిహీనములౌనగాపగ
ల్గాసిలుపాంధపాళికి సుఖస్థితి నీర మొసంగనోపునే

సుగుణపరిభావము.

చ॥ అగణితసద్గుణుండు సుగుణాన్వితునింగనుగొన్న మాత్రఁద
త్సుగణతతిస్వరించుగుణశూన్యుఁడు నిత్యముఁ జెల్మిఁ జేసిన
న్నగడిగణింపలేఁడు నళినీసుమనోమకరందభుక్తిభృం
గగణముపాలుగాక మఱిఁ గప్పకు నెందు లభింపనేర్చునే

పూర్వకర్మానుభవము

ఉ॥ భూతలమందుమర్త్యుఁడుప్రభూతఫలంబునుగోరియార్యుల
జ్ఞేతమునందు భక్తిఁగొని చేరిభజించినఁబూర్వకర్మసం
ఘాతవిధంబుఁగాంచు శితికంఠగళస్థితసర్పవల్లభుం
డాతరుణేందుశేఖరకృపాప్తినిమానెనె గాలిమేతలన్

కృతజ్ఞత

చ॥ అరసిమనీషియాదరము నార్యులకుంబ్రసరింపఁజేసిమే
ల్నిరతము నాచరించుఁగడు నేర్పరికాన నదెట్టులన్నచో
నరుఁడు జలమ్ములుంచి జతినమ్మునఁ బెంచిన నారికేళము
ల్విరివిగఁ గాచియిచ్చుసరవి న్మధునీరము లెల్లవారికిన్

కృతఘ్నత

ఉ॥ చెంతకుఁదీసినిత్యము వశీకృతుఁ జేసి ప్రియంబుఁజూపన
త్యంతముదుర్జనుండుహృదయంబునఁ గిల్బిషమున్విడండుచూ
సాంతముఁ బాదుఁ జేసిసుధఁజల్లిప్రసక్తివహించి పెంచిన
న్నుంతయుఁ జేదువాయునె వసుంధర నింబమహీజసంతతుల్

మహోపాయము.

చ॥ క్షితితలమందుఁ బ్రాజ్ఞుఁడు విశేషపరిశ్రమదూరుఁడై చమ
త్కృతిలఘుభూరియత్నములు రేయిఁబగల్లఘుభంగిఁ జేయు స
న్నుతపథ మొప్ప నెట్టులన నూత్ననదీరఘురము ల్దటస్థితో
చ్ఛ్రితతరుఘాససంతతిఁ గ్రసించుట లేదె యొకేవిధంబుగన్॥

అత్యావశ్యకత.

చ॥ కరమునురక్తితోఁ బ్రజలఁ గంటికి రెప్పవిధానఁ బ్రోచు భూ
వరుఁడు లభింపకున్నఁ బ్రజ వైభవహీనతఁ జెంది నష్టమా
త్వరగతి నావిక న్నడుప వారిధియందునఁ గర్ణధారుఁడే
దొరుకక యున్న మున్గదొకొ తోరపునావికవస్తుపూర్ణమై

సేవ్యసేవకాంతరము.

మనుజుఁడొకండు సంతతము మానవనాయకు నాశ్రయించి కై
కొనుఁ దదనుగ్రహంబుఁ దదకుంఠితసంపదఁ గాంచలేఁడు తా
ననిశము వేడి శంకరుఁ దదాదరణంబు వహించు భక్తుఁడై
పనిగొని కాలకూటగళుప్రాభవమూను నె లబ్ధయత్నుఁడై॥

సాధునిబంధము.

చ॥ ఘోరకొని దుర్జనుండొకఁడు దుందుడుకొప్పదురంతకృత్యము
ల్గరకరిత్రమై ఘటించునెడ గాసిలుఁగాదె సుహృజ్జనంబు ని
ష్ఠురుణుఁడు రావణాసురుఁడు జానకి వంచకుఁడై హరించుచో
శరధికి బంధనంబుఁ గపిసంఘముచే సమకూరెఁ దోడుతోన్॥

సమబలవిరోధము.

చ॥ అమితబలుండు దుర్బలులకారడిగూర్పక విక్రమాఢ్యతో
సమర మొనర్చి తజ్జనితసత్త్వము మాపునుగాదె మిక్కిలి
న్భ్రమగతిఁ బోవుచోఁ దృణము పై వడిఁ బాఱక యప్రమత్తుఁడై
గమచమహాతరూత్కరము గంధవహుం డురుశక్తి సూపుచున్

దురాశాలంబనము.

ఉ॥ మందమనీషి యొక్కఁడు సమర్థునకబ్బెడు పూర్ణలాభము
న్నొందఁ దలంచి యత్నమును జేసిన నాతఁడు వొందఁబోఁడుగా
నిందితహ్రస్వబాహుఁడవని న్బృథువృక్షఫలంబుఁ గోరిన
న్నొందఁడె వంచనమ్మును హసింప జనుల్గడు విన్నఁబోవుచున్

జీవయాత్ర.

ఉ॥ మృత్యు వహర్నిశంబుఁ గడిమి న్ననంటి చరింప భూమిపైఁ
బ్రత్యహమందు వైభవముపట్ల నరుండు కృషి న్వహించెడు
న్సత్యు; మదెట్లన న్వ్యాసుఁడు సర్పమునోటను జిక్కి యీఁగల
న్హత్యనొనర్పఁ బట్టకయి యాతురతన్గొని కప్ప బేలయై॥

ధూర్తలక్షణము.

ఉ॥ సమ్మతిఁ గోపవంతునకు శాంతవచస్సు లుపన్యసింపఁ బో
హుమ్మని యాగ్రహించు విహితోక్తులు దెల్పెడి సౌమ్యవక్త్రపై
నిమ్మహిఁ బాపకంబున యథేచ్ఛగఁ గాచిన నాజ్యమందుఁ దో
యమ్ములు పోయ భగ్గుమని యద్దిర! మండు భయంకరమ్ముగన్

పరస్పరవిరోధము.

బలయుతుఁ డెవ్వఁడో పఁడెడఁ బాయుటకున్బ్రథు కోపజన్యమౌ
యలఘువిమోహమట్టి నృపుఁడందఁగ నోపఁడు రాజ్యసంపద
ల్వలు మరుఁ గృష్ణపక్షమున బంధురమౌ తిమిరంబుఁ గూడి రా
త్రిం లలితచంద్రఘృష్టుల హరించును మీఱి దినక్రమంబుగన్

క్రోధప్రభావము.

చ॥ ఇలను బరస్పరంబుమది నీసున మంత్రులకుద్భవించు సం
కులమదదృష్టి సత్వరము గూల్చు సమూలముగా నృపాలకు
న్నెలఁగి ప్రచండవాతహతిచేనగు ద్రుమాకుల గాపిశి న్నగ
ల్గలిగి ధనంజయుండకట గాల్చు సవృక్షధరంబు బూదిగన్